క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: మండలకేంద్రం పిచ్చాటూరులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతి రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఎమ్మెల్యే స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని తుపాను వల్ల మరణించిన పశువులకు ప్రభుత్వ పరిహారం చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలో మంగళవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిచాంగ్ తుపాను కారణంగా మృతి చెందిన పాడి ఆవులు, మేకలు, పాడిరైతులకు ఉదయం 8 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ సాయం ఎమ్మెల్యే ఆదిమూలం అందిస్తారని పేర్కొన్నారు.

ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు



జేసీబీతో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు–పుత్తేరి రోడ్డు ఓవర్ లోడుతో వెళ్లే క్వారీ లారీల కారణంగా ధ్వంసమైంది. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌పాల్, చంద్రారెడ్డి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. క్వారీ లారీల వల్ల రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్పందించిన ప్రసాద్‌పాల్, చంద్రారెడ్డి జేసీబీ యంత్రంతో గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ధ్వంసమైన చెత్త వాహనం

శ్రీకాళహస్తి: పారిశుద్ధ్య కార్మికురాలికి త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. నిత్యం రద్దీగా ఉండే జయరామారావు వీధిలో సోమవారం ఉదయం చెత్త సేకరించే నిమిత్తం పారిశుద్ధ్య కార్మికురాలు విధులు నిర్వహిస్తోంది. అదే సమయంలో ఓ భారీ లారీ దూసుకొచ్చింది. గమనించిన ఆమె అప్రమత్తమై పక్కకు తప్పుకోవడంతో చెత్తవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చెత్తవాహనం ధ్వంసమైంది. పారిశుద్ధ్య కార్మికురాలు స్వల్పగాయాలతో బయటపడింది. అధికారులు స్పందించి ఈ మార్గంలో భారీ వాహనాలు రాకుండా అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేపచెట్టు నుంచి పాలధార



వేపచెట్టు నుంచి కారుతున్న పాలధార

నారాయణవనం: మండల కేంద్రం నారాయణవనంలో వేపచెట్టు నుంచి పాలు కారుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నారాయణవనం ఎగువ కోటవీధిలోని సుమారు 20 అడుగుల వేప చెట్టు నుంచి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పాలు కారడాన్ని మహిళలు గుర్తించారు. ప్రారంభంలో కొద్దిగా కారుతున్న పాలధార క్రమంగా పెరగడంతో మహిళలు, పిల్లలు గుంపులు గుంపులుగా తరలివచ్చి చూస్తున్నారు.

ఓంశక్తి అమ్మవారికి పూజలు



ఓంశక్తి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాలసముద్రం : మండంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏట్టుకూరిపల్లెలో ఓంశక్తి భక్తులు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు ఓం శక్తి మాలలు ధరించిన భక్తులు అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించారు. మధ్యాహ్నం అమ్మవారి చిత్రపటాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. గురుస్వామి ఓంశక్తి భక్తులకు ఇరుముడి కట్టారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మేల్‌మరవత్తూరు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఇరుముడి కట్టుకుని వెళ్లారు.

సెయింట్ పీటర్స్ లూథరిన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి, సత్యవేడు సీఎస్‌ఐ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు, సత్యవేడు దళితవాడలో.., బీఎన్‌కండ్రిగ చర్చిలో.., పిచ్చాటూరులో శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు







- అట్టహాసంగా క్రిస్మస్ వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఏసు మార్గం.. అనుసరణీయం

నారాయణవనం: ఏసుప్రభు మార్గం అందరికీ ఆదర్శనీయమని, సేవాదృక్పథంతో నిండి ఉంటుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం మండలంలోని కల్యాణపురం పంచాయతీ పద్మావతీనగర్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చర్చిలో ప్రార్థనలు అనంతరం ఆయనను పాస్టర్లు శాలువ కప్పి సన్మానించారు. 50 మంది పేద మహిళలకు, పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటివారి పట్ల కరుణ, ప్రేమానురాగాలతో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని పులుపునిచ్చారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణవ్యాప్తంగా చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాయుడుపేట మార్గంలో కాసాగార్డెన్ వద్ద ఉన్న సెయింట్ పీటర్స్ లూథరిన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొని మతపెద్దల



వరదయ్యపాళెం: చిన్న పాండూరు చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ పాల్ మహేష్

ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విశ్వాసులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లిలోని సెయింట్ మార్క్ ప్రార్థన ఆలయంలో నిర్వహించిన ఏసుక్రీస్తు ప్రత్యేక ఆరాధనోత్సవాల్లో బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాని, ప్రేమ, కిరణ్, ప్రసాద్, ఏసు, హరి, డేవిడ్, సుప్రియ, హేమ, మోహనయ్య, గున్నయ్య, ధనకోటి, కిశోర్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఫాదర్ చార్లెస్ రాబర్, పాస్టర్లు నవగుణం, మనోజ్ అన్నారు. మండలవ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి ప్రాంగణాల్లో శాంతాక్లాజ్ బొమ్మలు, పశువులపాకలు, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలు ఆకర్షణగా నిలిచాయి. క్రైస్తవులు ఇళ్లపై నక్షత్రాలను ఏర్పాటు చేసి ప్రభువుపై ఉన్న భక్తిని, ప్రేమను చాటుకున్నారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లు అందజేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిల్లో పాస్టర్లు బైబిల్‌ను పఠనం చేసి ప్రార్థనలు చేశారు. భక్తిగీతాలను ఆలపించారు. చర్చిలను విద్యుత్ దీపాలతో, రకరకాల పూలను అలంకరించారు. చర్చిల్లోని ప్రార్థనల్లో భారీసంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొన్నారు.

వేడుకగా క్రిస్మస్ సంబరాలు

పిచ్చాటూరు: మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే వారు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక యహోవా చర్చిలో దాత ఎస్.థామస్ పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సమాధాన ప్రభు సంఘం, సీఎస్ఐ, పెంతెకొస్తు, చర్చి ఆఫ్ క్రైస్టులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్వమానవాళి పాపాలను ప్రక్షాళన చేసి ఆత్మలను పరిశుద్ధం చేసే క్రీస్తుతత్వం అందరికీ ఆదర్శనీయమని పాస్టర్లు తెలిపారు. చర్చిల ఆవరణలో అన్నదానం, మిఠాయిలు పంపిణీ చేశారు.

వరదయ్యపాళెంలో...

వరదయ్యపాళెం: క్రిస్మస్ వేడుకలు మండలవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మండలంలోని రాచర్ల, కంచరపాళెం, చిన్న పాండూరు, బత్తలవల్లం, యానాదివెట్టు, చిలమత్తూరు, పెద్దపాండూరు, వరదయ్యపాళెం, శాటిలైట్ కాలనీ, ఇందిరా కాలనీ, ఎంజీ నగర్, కారిపాకం, మరదవాడ, కాంబాకం గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.







చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం, చర్చిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి, పిచ్చాటూరు : చర్చిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దాత థామస్, కాంబాకంలో.., బత్తలవల్లం చర్చిలో ..

సీఎం జగన్‌తోనే నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి సాధ్యమని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిందేపల్లి భాస్కరయ్య అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు భరోసా కార్యక్రమంలో ఆదివారం ముఖ్యమంత్రి జగన్‌పై యాకసిరి కృష్ణమూర్తి, కుటుంబసభ్యులు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రచరిత్రలో మొదటిసారి నాయీబ్రాహ్మణులకు అధికారాన్ని ఇచ్చిన మొదటి వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అదే విధంగా ఒక ట్రస్టు బోర్డు మెంబరుగా నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించారని, అట్రాసిటీ చట్టం తీసుకువచ్చి జీఓను విడుదల చేశారని తెలిపారు. ఏటా నాయీ బ్రాహ్మణ దుకాణం ఉన్నవారికి రూ.10 వేలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఇలాంటి గొప్ప సీఎం గురించి యాకసిరి కుటుంబ సభ్యులు అవివేకంగా మాట్లాడడం సరి



సమావేశంలో మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణులు

కాదన్నారు. యాకసిరి కుటుంబం అంతా కబ్జాదారులతో కూడిందన్నారు. ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు కేటాయించిన 150 ప్లాట్లను 200గా చేసి 50 ప్లాట్లను కబ్జా చేసి పట్టాలు లేనివారికి అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అందుకు సంబంధించిన రికార్డులు తన వద్ద ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి జగనన్నను విమర్శించే స్థాయి వారిది కాదన్నారు. కార్యక్రమంలో మునికుమార్, మురళి, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈ నెల 27వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవికెల సేకరణ లీజు హక్కు, అమ్మవారి ఫొటోలు, కీ చైన్లు వగైరాలు విక్రయానికి కౌలు హక్కు కల్పించనున్న సందర్భంగా ఈ బహిరంగ వేలం పాట చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ లీజు హక్కు డిసెంబర్ 27 నుంచి 2024 డిసెంబర్ 26వ తేదీ వరకు ఏడాదిపాటు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయం పనివేళల్లో సంప్రదించి వివరాలు పొందవచ్చని తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో మాసోత్సవాలు–2023ను పురస్కరించుకుని సోమవారం జరిగిన నృత్య ప్రదర్శన అలరించింది. పలు శివనామ కీర్తనలకు హైదరాబాద్‌కు చెందిన 40మంది కళాకారులు నృత్యం చేశారు. వారికి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రశంసాపత్రాలు, ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.



కళాకారులతో ఆలయ చైర్మన్ అంజూరు

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేతశ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పుటపర్తి ఎమ్మెల్యే దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

ముక్కంటి సేవలో ప్రాసిక్యూషన్ డైరెక్టర్

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ జె.సుదర్శన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద సుదర్శనరెడ్డి, ఆలయ అధికారులు

పూరి గుడిసె దగ్ధం



కాలిపోయిన పూరి గుడిసె

వెదురుకుప్పం: మండలంలోని వైఎస్సార్ ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కళావతికి చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని బాధితులు తెలిపారు. పూరిల్లు పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పచ్చికాపల్లం శ్రీలక్ష్మి ఎలక్ట్రానిక్స్ యజమాని ప్రసాద్ బాధిత కుటుంబానికి రూ.5 వేలు నగదు, వంట సరుకులు వితరణ చేశారు. దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లిషు మీడియం యాజమాన్యం బాధిత కుటుంబానికి అండగా నిలిచి దుస్తులు, దుప్పట్లు వంట పాత్రలు అందజేశారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ఏర్పేడు: ఏర్పేడు ఈసీఐ చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని 100 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. తొలుత చర్చిలో ప్రార్థనలు చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, సర్పంచ్ శివయ్య, వెంకటాద్రి, ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.



చర్చిలోని పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో బంగారు తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీకృష్ణ స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేక



తిరుచ్చిపై భక్తులకు దర్శనిమస్తున్న శ్రీకృష్ణ సమేత రుక్మిణి సత్యభామ

సేవను చేపట్టి, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రుక్మిణి సత్యభామ సమేత తిరుచ్చిపై కొలువైన దేవేరులను దర్శించుకున్న భక్తులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు ఎనలేనివి



సత్యవేడు: వాజ్‌పేయి జయంతి వేడుకల్లో బీజేపీ నేతలు



బుచ్చినాయుడుకండ్రిగ: వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సత్యవేడు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నేటి యువతరానికి ఆదర్శనీయులని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మునిప్రతాప్ అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆదివారం సత్యవేడులో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మచ్చలేని నాయకుడిగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండారు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు రెడ్డి, ఎర్రశెట్టి ఓబీసీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి వాసు, మండల ప్రధాన కార్యదర్శి మురళీ కృష్ణ, మహిళామోర్చా అధ్యక్షురాలు ఉషా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయికి నివాళులు అర్పిస్తున్న కోలా ఆనంద్

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: దేశ మాజీ ప్రధాని వాజ్‌పేయి 99వ జయంతిని సోమవారం మండల బీజేపీ అధ్యక్షుడు హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుచ్చినాయుడుకండ్రిగలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జెండాను ఎగురవేసి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశాభివృద్ధికి వాజ్‌పేయి చేసిన ఎనలేనివన్నారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎస్.వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శులు తేజ, మునికుమార్, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అంకమ్మ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శివకుమార్, ట్రెజరర్ లోకనాథం, నాయకులు హిమాచలం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో...

శ్రీకాళహస్తి: పట్టణంలోని భేరివారి మండపం వద్ద మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు ముందుగా బీజేపీ జెండాను ఎగురవేశారు. అనంతరం వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సుపరిపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రధాన మంత్రి మోదీ సుపరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం సంక్షేమఫలాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కండ్రిగ ఉమ, గరికపాటి రమేషబాబు, అమర్‌నాథ్, సుకుమార్, మద్దు వాసు యాదవ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఢిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలు సిద్ధం

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడాపోటీల నిర్వహణ కోసం మండలంలోని కొత్తపాళెం, పల్లమాల గ్రామాల్లోని క్రీడా మైదానాలను సర్పంచ్‌లు సుబ్బరత్నమ్మ, రమణమ్మ తొలగించి చదును చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద క్రీడా టోర్నీ ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమాన్ని 43 రోజుల పాటు 5 స్థాయిల్లో మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందన్నారు. 26వ తేదీన గ్రామస్థాయిలో, జనవరి 10న మండల స్థాయిలో, 24న నియోజకవర్గ స్థాయిలో, 31న జిల్లాస్థాయిలో ఫిబ్రవరి 6న రాష్ట్రస్థాయిలో పోటీ జరుగుతాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారే ఈ పోటీలకు అర్హులని తెలిపారు. ఈ క్రీడా మైదానంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




కొత్తపాళెంలో మైదానంలోకి మట్టి తోలుతున్న దృశ్యం, పల్లమాలలో క్రీడా మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం